క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష

పీసీపల్లి: మండలంలోని చినవరిమడుగు, వెంగళాయపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు జరుగుతాయని ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసుల రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయా సచివాలయల పరిధిలోని ప్రజలు ఏమైనా ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకాలు అర్హులై ఉండి లబ్ధి పొందని వారు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

నేడు వేములపాడులో వైద్య శిబిరం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వేములపాడు పంచాయతీలో ఉడుముల హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, స్త్రీ వైద్య నిపుణుల వైద్యులు సేవలందిస్తారన్నారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం


బీమా నగదు అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పథకం పేద వర్గాల పాలిట వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఒకటో వార్డులో అనారోగ్యంతో బైరాగి కొండమ్మ మృతి చెందింది. కొండమ్మ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10 వేల నగదును గురువారం చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనుల చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రామనబోయిన శ్రీను, దేవరాజ్, కన్వీనర్లు జానీ, పట్టణ పార్టీ యూత్ అధ్యక్షుడు ఎస్‌కే నాయబ్ రసూల్, రాజేంద్ర, పెద్ద రసూల్, సచివాలయ అధికారులు, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మర్రిపూడి ఎంపీడీఓగా బ్రహ్మయ్య


బ్రహ్మయ్య

మర్రిపూడి: మర్రిపూడి నూతన ఎంపీడీఓగా ఎల్.బ్రహ్మయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. కొండపి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న బ్రహ్మయ్యను మర్రిపూడి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ విలేకర్లతో మాట్లాడుతూ.. మండలంలో పారిశుద్ధ్యం, తాగునీరు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఈఓఆర్డీ ఎస్‌కే నాగూర్ వలి, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం


తనిఖీ చేస్తున్న ఏఈ మౌలాలీఖాన్

పీసీపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్ఈ ఆల్ఫోన్స్, డీఈ తోట శ్రీనివాసరావు, కనిగిరి విద్యుత్ శాఖ డీఈ ఎం నాగేశ్వరరావు అన్నారు. పీసీపల్లిలో విద్యుత్ అధికారులు 20 శాఖలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 868 సర్వీసులను తనిఖీ చేయగా అందులో 34 సర్వీసులకు రూ. 121500 జరిమానా విధించారు. లోడు కన్నా అధికంగా వాడిన 25 సర్వీసులకు రూ. 77000, మీటరు లేకుండా వినియోగిస్తున్న 5 సర్వీసులకు రూ.8500, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న రూ. 30000 జరిమానా విధించారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి హోమం


బాబా గుడిలో హోమం

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో సాయి సచ్చరిత్ర సప్త సప్తహ పారాయణ మహా యజ్ఞం, పూర్ణాహుతి గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధయోగిని విశుద్ధానంద భారతి మాతాజీ ఆధ్వర్యంలో మహా యజ్ఞం అత్యంత నియమనిష్టలతో నిర్వహించారు. యజ్ఞంలో పి. మాధవరావు, శాంతి దంపతులు, దేవకి సుబ్రహ్మణ్యం భాగ్యలక్ష్మి దంపతులు, ముచ్చర్ల ధర్మరావు, పద్మజ దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ నాయకులు టి.గోవిందరావు, మండ్లా వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, సంజీవయ్య, శ్రీ సాయి మహిళా సేవ బృందం పాల్గొన్నారు.

జగనన్న సురక్ష నిరంతర కార్యక్రమం


మాట్లాడుతున్న ఎంపీడీఓ జమీవుల్లా

సింగరాయకొండ: జగనన్న సురక్ష నిరంతర కార్యక్రమమని, దీనిని ప్రజల్లోకి ఉద్యమంలా తీసుకెళ్లి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీఓ షేక్ జమీవుల్లా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల తరహాలోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. జగనన్న సురక్షలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల జనన, మరణ, కుల, ఆదాయ, వివాహ, ఫ్యామిలీ, వారసత్వ సర్టిఫికెట్లతోపాటు రేషన్‌కార్డులో తొలగింపులు, భూ సమస్యలు, భూముల ఆన్‌లైన్ సమస్యలు వేగంగా, ఉచితంగా పరిష్కరిస్తున్నట్లు వివరించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో గృహాల సర్వే 65 శాతం పూర్తయిందని, ఆరు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి 1,592 మందికి సర్టిఫికెట్లు అందజేశామని వివరించారు. వలంటీర్లు సక్రమంగా పనిచేయకపోతే వారిని తొలగించే అధికారం పంచాయతీ కార్యదర్శికి ఉందన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ మాట్లాడుతూ.. సోమరాజుపల్లి పంచాయతీ ఆవుల వారిపాలెం, రైల్వేగేటు వద్ద కాలనీ, అప్పాపురం ఎస్టీ కాలనీ, తుఫానుషెల్టర్ వద్ద గల ఎస్టీ కాలనీలో మంచినీరు సక్రమంగా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్‌కు సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు మాట్లాడుతూ.. మండలంలోని జగనన్న కాలనీల్లో సుమారు 10 కోట్లతో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశామని ప్రతి ఇంటికీ కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. కాలనీలోని ప్రతి ఇంటికీ కరెంటు బిల్లు కూడా ఉచితమని, గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ కోట శ్రీహరి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, బల్క్ మిల్క్ సెంటర్లు పూర్తి చేయాలన్నారు. డాక్టర్ చైతన్య కృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు.

వైస్ ఎంపీపీలు షేక్ షకీల, సామంతుల రవికుమార్‌రెడ్డి, కనుమళ్ల సొసైటీ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, సోమిశెట్టి వాసవీ, ఏపూరి శ్రీనివాసులు, సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, మలినేని ఇందిర, జెట్టి విజయలక్ష్మి, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

987 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం దావగూడూరు, చింతలపాలెం గ్రామాల రైతులు 1039 బేళ్లు తీసుకురాగా 987 కొనుగోలయ్యాయి. 55 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.245, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.229.21 పలికింది. వేలంలో 35 మంది వ్యాపారులు పాల్గొన్నట్లు నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు గడువు పెంపు

కందుకూరు రూరల్: డిగ్రీ కోర్సుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల వరకు పొడిగించినట్లు టీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ తరువాత కోర్సుల ఎంపిక 15 నుండి 19 వరకు జరుగుతుందన్నారు. జూలై 24న సీట్ల కేటాయించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గమనించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దేశం గర్వించదగిన నేత జగ్జీవన్‌రామ్


కె.అగ్రహారంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అశోక్‌బాబు


టంగుటూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొన్నలూరు: భారతదేశం గర్వించదగిన నాయకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని కె.అగ్రహారంలో గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ భారతదేశ ఉప ప్రధానిగా విశిష్టసేవలు అందించి నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. దేశంలో దళితుల అభ్యున్నతికి నూతన సంస్కరణలు రూపొందించి వారి ఎదుగుదలకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, పల్లపోలు బాలకోటిరెడ్డి, మన్నెం చినవెంకటేశ్వర్లు, మెండా శ్రీరాములు, గొల్లపూడి రమణయ్య, ఎం.కాంతారావు, రామకృష్ణ, శ్రీరాముల శ్రీనివాసులు, నారపురెడ్డి మహేష్, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌కే రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక బొమ్మల సెంటర్లో మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. వైఎస్సార్ టీఎఫ్ మండల అధ్యక్షులు సూదనగుంట వెంకటస్వామి, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, ఎంపీటీసీలు బొడ్డు వాసంతి, కొమ్ము ప్రభుదాసు, తన్నీరు వీరనారాయణ, పేరారి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: బీజేపీ బలోపేతానికి దివంగత శ్యాంప్రసాద్ ముఖర్జీ కృషి ఎనలేనిదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి వెంకట రమణయ్య అన్నారు. స్థానిక పొట్టిశ్రీరాములు వీధిలోని బీజేపీ కార్యాలయం వద్ద డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పరపు వెంకట సుబ్బారావు, మోర్చా నాయకులు పాడే అరవింద్, కొత్తూరి హరగోపాల్, దేవిశెట్టి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల విచారణ వేగవంతం

- పట్టణంలోని జెరాక్స్, రబ్బరు స్టాంప్‌ల తయారీదారులను విచారించిన పోలీసులు
- అర్బన్‌కాలనీలో ఆర్డీఓ విచారణ

కనిగిరి రూరల్: దొంగ స్టాంప్‌లు, ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు తయారు చేసి అమాయక రైతులను, ప్రజలను మోసం చేసి భారీ దండుకున్న జగన్నాథ సురేష్‌పై రోజు రోజుకి ఫిర్యాదుల పరంపర పెరుగుతుండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ వేగవంతం చేశారు. దొంగపట్టాలు, పాస్ బుక్‌లు తయారు చేసేందుకు ఉపయోగించిన జెరాక్స్ పట్టాలు, అధికారుల ముద్రల రబ్బర్ స్టాంప్‌లను ఎక్కడ నుంచి తయారు చేశారనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పట్టణంలోని పలు జెరాక్స్ దుకాణ నిర్వాహకులను, రబ్బర్ స్టాంప్‌ల తయారీ వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి గురువారం పోలీసులు విచారించారు.

అర్బన్‌కాలనీలో ఆర్డీఓ విచారణ

పట్టణంలోని అర్బన్ కాలనీలో వేసిన లేవుట్లలోని కమ్యూనిటీ పర్‌పస్ వదిలిన స్థలాలను అక్రమిస్తున్నట్లు, హెలిప్యాడ్ స్థలం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి అక్రమ పట్టాలు సృష్టిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఆర్డీఓ టి.అజయ్‌కుమార్ గురువారం విచారించారు. గతంలో అర్బన్ కాలనీలో ఇచ్చిన లే అవుట్‌లో ఎక్కడెక్కడ ప్రభుత్వ భవనాలకు, స్కూల్స్‌కు, ప్లే గ్రౌండ్స్‌కు స్థలాలు వదిలి పెట్టారు... ప్రస్తుతం అక్కడ పరిస్థితి ఎలా ఉందనే దానిపై సమగ్ర విచారణ చేసి ఆక్రమణలో ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను అదేశించారు. అలాగే హెలిప్యాడ్ స్థలం, దాని పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు ఏమైనా జరిగాయా.. ఎవరైనా అక్రమించి నకిలీ పట్టాలు సృష్టించారా.. అనధికార, అక్రమ లే అవుట్లు వేశారా అనే దాన్ని కూడా పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. త్వరలో అర్బన్ కాలనీలో ఇచ్చిన లే అవుట్‌లను సమగ్ర దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ చెప్పారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ యు పుల్లారావు, రమేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అధికారుల సూచనల మేరకు సాగు చేయాలి


రైతులకు సూచనలిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఏఓ పి జోత్స్నాదేవి

కనిగిరి రూరల్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు అధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి పి.జోత్స్నాదేవి అన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని గురువాజీపేట ఆర్‌బీకే కేంద్రంలో రైతు ఉత్పత్తి సంఘాలకు వ్యవసాయ సాగు పంటలపై అవగాహన నిర్వహించారు. ఏఓ జోత్స్నాదేవి మాట్లాడుతూ రైతులకు పంట సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం అధికారులు ఏ శైలజారాణి, వీవీ శేషమ్మ మాట్లాడుతూ పంట సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. డీఆర్‌డీఏ సీసీ శ్రీనివాసులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, సర్పంచ్ సౌందర్య, ఉప సర్పంచ్ రాజమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

పీసీపల్లి: రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ అన్నారు. మండల పరిధిలోని తలకొండపాడు ఆర్‌బీకే పరిధిలో గురువారం రైతులకు ఖరీఫ్ సాగు విత్తనశుద్ధి, విత్తన ఎంపిక వంటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతు ఉత్పాదక గ్రూపులు, వాటి ఆవశ్యకత, బుక్ కీపింగ్, అకౌంట్ ఓపెనింగ్ గురించి వివరించారు. డీఆర్‌సీ టెక్నికల్ ఏఓ శేషమ్మ మాట్లాడుతూ వాతవరణ పరిస్థితులకనుగుణంగా విత్తన ఎంపిక, శుద్ధి, చీడపీడలు వంటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయాధికారి వెంకటస్వామి, తలకొండపాడు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు మార్గదర్శకుడు సుబ్బరాయుడు

కనిగిరి రూరల్: దివంగత సీనియర్ న్యాయవాది, మాజీ ఏపీపీ, ఏజీపీ కొప్పల్లి సుబ్బరాయుడు నేటి తరం న్యాయవాదులకు మార్గదర్శకుడని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో దివంగత సీనియర్ న్యాయవాది కొప్పల్లి సుబ్బరాయుడు సంతాపసభ గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం కల్గిన న్యాయవాది సుబ్బరాయుడని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కొప్పల్లి సుబ్బరాయుడు మృదు స్వభావి అని, సలహాలు, సూచనలు ఇవ్వడంలో న్యాయ కోవిధుడిగా పేరొందరాని కొనియాడారు. తొలుత కొప్పల్లి సుబ్బరాయుడు చిత్రపటానికి జడ్జి కె.భరత్‌చంద్ర, ఏపీపీ అరుణ, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్‌గఫార్, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో ఏజీపీ సానికొమ్ము శ్రీనివాసులరెడ్డి, కందుకూరు, పొదిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం మల్లికార్జున, రమణ కిషోర్, హరికృష్ణ, సీనియర్ న్యాయవాదులు రామణ తిరుపతిరెడ్డి, ఎం సుబ్రహ్మణ్యం, ఎంవీ విజయ్‌కుమార్, సీహెచ్ సాల్మన్, న్యాయవాదులు కోటయ్య, బాలనారాయణ, వలి, సుబ్బరావు, రాష్ట్ర న్యాయవాదుల గుమస్తాల సంఘం నాయకులు సయ్యద్ యాసీన్, మాజీ కోఆప్షన సభ్యుడు పీర్ల మస్తాన్‌వలి, మాజీ వార్డు సభ్యుడు ఎస్ ఎస్ రసూల్, బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి బేల్దారి మేస్త్రీకి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన రామచంద్రరావు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం చివర చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం పట్టణానికి చెందిన ఎస్.రామచంద్రరావు బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. నెల్లూరులో ఆలయ నిర్మాణానికి వచ్చి, పని పూర్తయ్యాక స్వగ్రామానికి వెళ్లేందుకు విక్రమ సింహపురి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వరకు టికెట్ తీసుకున్నాడు. సింగరాయకొండ స్టేషన్‌లో రైలు ఆగి తిరిగి బయలుదేరే క్రమంలో రామచంద్రరావు ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ప్లాట్‌ఫాంకు రైలుకు మధ్యలో పడటంతో ఎడమ కాలు పాదం, ఎడమ చేతి వేళ్లు చితికిపోయి తీవ్ర రక్తస్రావమైంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీఆర్పీ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ యంత్రసేవ సద్వినియోగం చేసుకోండి


యంత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, హుసేన్‌రెడ్డి

పామూరు: వైఎస్సార్ యంత్రసేవా పథకం అన్నదాతలకు వరం లాంటిదని ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బలిజపాలెంలో రైతుభరోసాకేంద్రం పరిదిలో గురువారం వ్యవసాయాధికారి కంచం రాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతులకు వైఎస్సార్ యంత్రసేవాపథకం కింద మంజూరైన యూనిట్లకు సంబందించి 2.16 లక్షల విలువచేసే వ్యవసాయ పరికరాలు ట్రాక్టర్లు, ట్రాలీ, నాగళ్లు, గొర్రులు, ఎరువులు స్ప్రే మిషన్ మొదలైన యంత్రాలు పంపిణీచేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించి వ్యవసాయాన్ని పండుగచేసి రైతుపక్షపాతిగా నిలుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గోవిందయ్య, కొల్లూరి రవికిరణ్‌శర్మ, వెంకట్రావు, రామారావు, మానం మాధవరావు, కొల్లా క్రిష్ణయ్య, సీహెచ్.రమణయ్య, తాళ్ల నాగేశ్వరరావు, చప్పిడి కొండస్వామి, వీఏఏ పి.అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

పామూరు: మండలంలోని వగ్గంపల్లె సచివాలయ పరిధిలో శనివారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్


డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 5వ వార్డులోని కూచిపుడి పల్లిలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.83 లక్షలతో జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు గురువారం చైర్మన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం చేయించాలని ఏఈ ని ఆదేశించారు. మున్సిపాలిటీని పలు వార్డుల్లో ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘ నిధుల కింద రూ.50 లక్షలతో వాటర్ పైప్‌లైన్, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలోని వాటికల అభివృద్ధికి రూ 40లక్షలతో టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ కృషితో పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి పట్టణానికి 20 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయన్నారు. లో ఓల్టేజీ, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికి 12 కొత్త ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేశామన్నారు. కనిగిరి పట్టణానికి రెండు కొత్త సబ్ స్టేషన్లు వచ్చాయని, అందులో ఒకటి అర్బన్ కాలనీలో నిర్మాణం చివరి దశలో ఉందన్నారు. మరోకటి కందుకూరు రోడ్డు వైపు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్ దేవరాజ్, ఏఈ కోటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిమ్మిడి శెట్టి శ్రీనివాసుల నాయుడు, ఎస్‌కే మన్సూర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వేగవంతం చేయాలని ఎంపీపీ డి.ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కాలనీల నిర్మాణంపై అధికారులు లబిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆగిన ఇళ్ల నిర్మాణాలను తిరిగి చేపట్టేందుకు సమాఖ్య సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న నీటి పైప్‌లైన్ నిర్మాణాలు తదితర పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ అందచేయడమే లక్ష్యంగా సచివాలయ అధికారులు పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి జగనన్న సురక్ష పథకం ద్వార న్యాయం చేయాలన్నారు. ఏఈలు రామనాథం, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ రహమత్ బాషా, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో ప్రతి సమస్యకు పరిష్కారం


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: జగనన్న సురక్ష పథకంలో భాగంలో ప్రజల నుంచి దాఖలైన ప్రతి అర్జీకి సత్వరమే పరిష్కారం చూపాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని కంకణంపాడు, రామగోపాలపురం, మొగళ్లూరు గ్రామ పంచాయతీలను ఎంపీడీఓ టి.సుకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి. సుకుమార్ మాట్లాడుతూ కంకణంపాడు, రామగోపాలపురం గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్షపథకం కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు అంకితభావంతో పనిచేసి జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. వెలిగండ్ల సర్పంచ్ టి. సురేష్‌బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.